క్లుప్తంగా

శిష్టకరణాల అభ్యున్నతికి వినతి



మంత్రితో అనూష పట్నాయక్, తదితరులు

బీచ్ రోడ్డు: శిష్టకరణాల అభ్యున్నతి కోసం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు వేణు గోపాలకృష్ణ, సురేష్‌బాబును శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ కోరారు. మంగళవారం నగరానికి విచ్చేసిన మంత్రులను ఓ హోటల్‌లో ఆమె కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శిష్టకరణాలను ఓబీసీలో చేర్చేందుకు ఎన్‌సీబీసీకు సిఫార్స్ లేఖ అందించినందుకు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయంతి శశిధర్, రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో కూలిన చెట్టు



చెట్టును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో ఓ చెట్టు మంగళవారం నేలకూలింది. ఎంవీపీ సర్కిల్ నుంచి డీఆర్‌డీఏ వైపు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా భారీ చెట్లు ఉన్నాయి. మంగళవారం అకస్మాత్తుగా ఓ చెట్టు కూలి రోడ్డుపై పడింది. ఆ సమయంలో అటువైపుగా ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న జీవీఎంసీ అధికారులు మధ్యాహ్నం చెట్టును తొలగించే పనులు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిడి కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీది నయవంచన'

మద్దిలపాలెం : రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన విభజన హామీలను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇవ్వకుండా అనుసరిస్తున్న నయవంచనను సహించేది లేదని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాష్ట్ర ప్రయోజనాలకు చెల్లు చీటి రాసినట్టుగా చెప్పారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీసేలా బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ప్రగల్భాలు పలికిన ప్రస్తుత ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పదవిలోకి రాగానే మాటమార్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు కోసం కేంద్రాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమం



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఉద్యమం కొనసాగిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 901వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ రోడ్డు విస్తరణకు సన్నాహాలు



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న నివాసితులు

- అభిప్రాయ సేకరణ చేపట్టిన అధికారులు
- ఈసారైనా పూర్తి చేయాలని ప్రజల విజ్ఞప్తి

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు ప్రధాన రహదారి విస్తరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా హనుమంతవాక నుంచి కైలాసగిరి కూడలి మీదుగా జోడుగుళ్లపాలెం బీచ్ కూడలి వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ కోసం మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక వార్డు కార్పొరేటర్ స్వాతి, జీవీఎంసీ జోన్-2 ఏసీపీ వెంకటేశ్వరరావు, టీపీవో వరప్రసాద్, విశాలాక్షినగర్ సంఘం పెద్దలు, రోడ్డు పక్కన నివాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ వల్ల ఉపయోగం గురించి వివరించారు. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం విస్తరణకు సంబంధించి నివాసితుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇదిలా ఉండగా గతంలో ఈ రోడ్డును 100 అడుగుల విస్తరణ ప్రతిపాదన చేశారు. సుమారు పదేళ్ల క్రితం కైలాసగిరి కూడలి నుంచి సంజీవినగర్ కాలనీ వరకు విస్తరించి మిగిలిన రోడ్డు భాగం విడిచిపెట్టేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో కొందరు నివాసితులు రోడ్డు విస్తరణకు అంగీకరించకపోవడంతో వారికి స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మద్దతుగా నిలిచారని ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే వెలగపూడి వల్లే ఈ విస్తరణ ఆగిపోయిందని విమర్శలు నేటికీ వినిపిస్తున్నాయి. దీంతో కొన్నిచోట్ల ఈ ప్రధాన రహదారి ఇరుకుగానే ఉంటుంది. ఈ సారైనా ఈ రోడ్డు విస్తరణ సజావుగా జరిపించాలని పలువురు కోరుతున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంఘం పెద్దలు సత్తి నాగేశ్వర రెడ్డి, జీవీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఝాన్సీ, టౌన్ సర్వేయర్ చంద్రశేఖర్, సిబ్బంది, రోడ్డు పక్కన నివాసితులు పాల్గొన్నారు.

పూడిక తీశారు.. వదిలేశారు!



శ్రీకాంత్‌నగర్ రోడ్డు పక్కన పూడిక దిబ్బలు

ఆరిలోవ: జీవీఎంసీ సిబ్బంది ఇటీవల ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల గెడ్డల్లో పూడిక తొలగించారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పైనుంచి వచ్చే వరద నీరు కిందకు పోవడానికి వీలుగా గెడ్డల్లో పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలను పొక్లెయిన్‌తో తొలగించి శుభ్రం చేశారు. ఇందులో భాగంగా శ్రీకాంత్‌నగర్ వద్ద గెడ్డలో తొలగించిన పూడికను ఇక్కడ రోడ్డు పక్కన దిబ్బలుగా వేసి వదిలేశారు. సుమారు రెండు వారాల నుంచి ఇక్కడ ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులతో పాటు అటుగా ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

5, 6 తేదీల్లో చెస్ పోటీలు

ఎంవీపీ కాలనీ: ఈ నెల 5, 6 తేదీల్లో చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎంవీపీ కాలనీలోని శ్రీచెస్ అకాడమీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. జానకమ్మలు నాలుగో మెమోరియల్ ఓపెన్ చెస్ టోర్నీ పేరిట జరిగే పోటీలు ఏయూలోని జిమ్నాస్టిక్స్ స్టేడియం వేదికగా జరగనున్నాయని పేర్కొన్నారు. విజేతకు రూ.30 వేలు బహుమతిగా అందించనున్నామని తెలిపారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ఆసక్తి ఉన్న వారు 99099 71232 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విశాఖ అభివృద్ధికి సీఎం జగన్ అహర్నిశలు కృషి



16వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 16వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఇప్పటి వరకూ అందిన పథకాల వివరాలు తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ ఐటీ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దడానికి ఇన్ఫోసిస్ వంటి సంస్థల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. అర్హులైన పేదల అందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో అధిష్ఠంపజేశారు. ఆలయ బేడామండపంలో సాయంత్రం తిరువీధి ఘనంగా నిర్వహించారు.

సీజీహెచ్ఎస్‌కు ప్రత్యామ్నాయం చూపాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు చినవాల్తేరులో ఉన్న సెంటర్ గవర్నమెంట్ హెల్త్ సెంటర్‌లో కొంత భాగం కూల్చివేయడంతో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. మంగళవారం సీజీహెచ్ఎస్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ ప్రత్యామ్నాయం చూపకుండా సెంటర్‌లో కొంత భాగం తొలగించడం తగదన్నారు. రోడ్డు విస్తరణలో కొంత భాగం తొలగించేటప్పుడు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు టి.సత్యనారాయణ, ఎస్.ఎం.మౌలాలి, ఉప్పల అప్పలరాజు, ఎ.ఆదినారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రహమాన్, సి.ఎస్.క్షేత్రపాల్, జి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గుడిలోవ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ పాఠశాల విద్యార్థులు షూటింగ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 30న విశాఖలో నిర్వహించిన జూనియర్స్ విభాగం పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు అఖిల్, వరహా ధనుంజయ్, సంజయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి 15 మంది గల జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. ఈ నెల 12, 13న నెల్లూరులో రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ఆడనున్నారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించింది.

అవ్వాతాతలకు ఠంచన్‌గా పింఛన్



16వ వార్డులో వృద్ధురాలికి ఇంటి వద్దనే పెన్షన్ అందిస్తున్న వలంటీర్ ప్రశాంత్



20వ వార్డులో వృద్ధురాలికి పెన్షన్ డబ్బులు అందిస్తున్న వలంటీర్

ఏయూ క్యాంపస్: అవ్వాతాతలకు నెలలో ఒకటో తేదీన పెన్షన్ డబ్బులు ఠంచన్‌గా అందించారు. జీవీఎంసీ 20వ వార్డులో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో ఉదయం నుంచి పెన్షన్ పంపిణీలో వలంటీర్లు తలమునకలయ్యారు. వృద్ధులు, ఇతర పెన్షనర్ల ఇంటికి బయోమెట్రిక్ తీసుకుని పింఛన్ అందచేశారు.

తప్పిన పెను ప్రమాదం



దెబ్బతిన్న కారు ముందు భాగం

కొమ్మాది: బీచ్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. రుషికొండ నుంచి వైజాగ్ వెళ్తున్న ఓ కారు అతివేగంతో రాడిసన్ బ్లూ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు బోల్తా పడి టైర్ పేలి ముందు భాగం నుజ్జునుజ్జయింది. అయితే ఆ సమయంలో ఆ మార్గంలో ఇతర వాహనాలు ఏవీ రాకపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు.

రామాయణం మహాకావ్యం



ప్రసంగిస్తున్న రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో ప్రముఖ రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు 'రామాయణంలో సోదరానుబంధం'పై ప్రసంగించారు. రామాయణం జాతీయ మహా కావ్యమని, జాతి యొక్క సంస్కృతి, సనాతన ధర్మాన్ని అద్దం పట్టే విధంగా రామాయణాన్ని విశ్వకవి వాల్మీకి అందించారన్నారు. సకల ధర్మాలు, కుటుంబంలోని సంబంధాలు ఎలా ఉండాలో రామాయణంలో తెలియజేశారన్నారు. భారతీయ సమాజంలో కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, మన సంస్కృతి బలంగా ఉండడానికి కుటుంబ వ్యవస్థే కారణమన్నారు. రామాయణంలో నాలుగు చోట్ల అన్నదమ్ముల అనుబంధం కన్పిస్తుందన్నారు. అయోధ్యలో రామలక్ష్మణ, భరత శతృఘ్నులు, కిష్కిందలో వాలిసుగ్రీవులు, లంకలో రావణ విభీషణులు, అలాగే పక్షి సోదరులు సంపాతి, జటాయువులు అన్నదమ్ముల గురించి వివరించారు. లలితానంధభారతీ స్వామి మాట్లాడుతూ లలితాపీఠం అధ్యాత్మిక విశ్వవిద్యాలయమని కొనియాడారు. అనంతరం లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

ఘనంగా ఎల్లో డే



పసుపు రంగు దుస్తులతో విద్యార్థులు

ఆరిలోవ: స్థానిక టీఐసీ పాయింట్ సమీప భారతీ స్కూల్‌లో మంగళవారం ఎల్లో డే వేడుక ఘనంగా జరిగింది. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు పసుపు రంగు దుస్తులతో సందడి చేశారు. ఆయా తరగతి గదుల్లో పసుపు రంగు వస్తువులతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.వి.రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి

ఎంవీపీ కాలనీ: విశాఖ పర్యటనకు మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖకు అన్ని అంశాల్లోనూ ప్రాధాన్యం ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన పలు అంశాలను వైఎస్ జగన్‌కు అక్కరమాని వివరించారు. తోటగరువులో జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు.



విశాఖ నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీకి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, వర్సిటీ అధ్యాపకులు, అధికారులు

విద్యా సమాచారమ్

నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన




మాట్లాడుతున్న ఆచార్య చంద్రమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలన, రాజనీతిశాస్త్ర విభాగంలో విద్యార్థులకు ఉన్నత విద్యలో వ్యవస్థాపక నైపుణ్యాలు అంశంపై ప్రత్యేక ప్రసంగం ఏర్పాటు చేశారు. తమిళనాడు విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవసరమైన నైపుణ్యాలను పొందే విధానాలు వివరించారు. సామాజికపరమైన నైపుణ్యాలు ఉన్నవారికి అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ శంకర్రావు, ఆచార్య షేక్ సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం రేపు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్ రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో ఈ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి అవసరమైన ఔషధాలు సూచిస్తారన్నారు. సమాచారం కోసం 94401 91673 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మణుడు సహిత సీతారాములు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం సీతాదేవి, లక్ష్మణుడి సహిత శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పసుపు, గంధంతో పాటు పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం సాయంత్రం కార్యక్రమంలో భాగంగా కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు నిర్వాహకులు సరిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

పక్కాగా ఫీవర్ సర్వే చేపట్టాలి



ఫీవర్ సర్వేపై ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్

మద్దిలపాలెం: మలేరియా, డెంగ్యూ కట్టడికి ఫీవర్ సర్వేను ఆశా వర్కర్లు పక్కాగా చేపట్టాలని జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ సూచించారు. రేసపువానిపాలెం, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా నివారణకు ఫీవర్ సర్వే ఎంతో కీలకమన్నారు. జ్వర పీడితులు ఉంటే వారి నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరణకు ఆరోగ్య కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు తొలగించాలని సూచించారు. నీటి నిల్వలే దోమల ఉత్పత్తికి కారణమన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కుమార్, రత్నం, మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరుల తల్లికి లక్ష కుంకుమార్చన



కుంకుమార్చన పూజలో పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి ఆలయంలో లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా మంగళవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10 వేలు చెల్లిస్తే వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. అమ్మవారిని డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గుడ్ల తనూజ దంపతులు దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీచక్రనవవర్ణార్చన

కనకమహాలక్ష్మి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రనవవర్ణార్చన, లక్ష్మీహోమం ప్రత్యేక పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన పూజలో ఇద్దరు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.2,516 చెల్లిస్తే దంపతులను అనుమతించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూర్చుతుందని తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఆనందపురం : మండలంలోని వేములవలస సమీపంలో ఆరు లైన్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఉమ్మడాల చంద్రమౌళి, అతని భార్య వెంకటలక్ష్మి 15 ఏళ్ల క్రితం ఉపాధి కోసం విశాఖనగరం వలస వచ్చారు. దుర్గానగర్‌లో ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంకట లక్ష్మి తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో గత నెల 29న భార్యా భర్తలిద్దరూ స్కూటీపై హుస్సేన్‌పురం వెళ్లారు. వెంకటలక్ష్మి తండ్రి వద్దే ఉండిపోగా చంద్రమౌళి గత నెల 31న బయలుదేరి తిరిగి దుర్గానగర్ వస్తున్నాడు. అతను వేములవలస సమీపానికి చేరుకునే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో చంద్రమౌళి (43) తూలి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. ఈ మేరకు అంబులెన్స్‌లో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బంధువులు ఎవరూ సకాలంలో రాకపోయేసరికి కేజీహెచ్ శవాగారంలో మృతదేహాన్ని భద్రపరిచారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.